www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 12 ఆగస్టు 2025

5

తూర్పుగోదావరి

జిల్లా స్థాయి పిజిఆర్ఎస్‌కు 157 అర్జీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి పిజిఆర్ఎస్‌కు 157 అర్జీలు అందాయని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. అర్జీలు స్వీకరించిన అనంతరం ఆమె అధికారులతో మాట్లాడారు. అర్జీదారుల సమస్యలను ఓర్పుతో విని, మర్యాద పూర్వకంగా స్పందించాలని ఉద్యోగులకు సూచించారు. అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కరించలేని వాటికి తగిన కారణాలను అర్జీదారులకు తెలియజేయాలన్నారు. మండలాల వారీగా రోజువారీగా ఫిర్యాదుల పరిష్కార తీరును సమీక్షించాలన్నారు. గ్రీవెన్స్ ఎక్కువగా ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి అర్జీపై ఎండార్స్‌మెంట్ తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెసి ఎస్.చిన్నరాముడు, జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా ప్రయివేటు హాస్టళ్లు

అనుమతులు లేకుండానే ఏర్పాటు
నిబంధనలను విస్మరించి నిర్వహణ
కనిపించని భద్రతా చర్యలు
కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రయివేటు హాస్టల్స్‌పై అధికార యంత్రాంగం పర్యవేక్షణ కరువైంది. ఎటువంటి అనుమతులు లేకుండానే హాస్టళ్లను నిర్వహిస్తున్నారు. వేల్లో ఫీజులు వసూలు చేస్తున్నా, నాణ్యత లేని భోజనం పెడుతున్నప్పటికీ గతిలేని పరిస్థితుల్లో విద్యార్థులు అక్కడే ఉంటున్నారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో ప్రభుత్వ సంఖ్యలో విద్యార్థులు విద్యనభ్యసించేందుకు నగరానికి తరలి వస్తున్నారు. ప్రభుత్వ హాస్టల్స్‌లో సీట్లు లేకపోవడంతో ప్రయివేటు హాస్టళ్లను ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెరిగిన డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ హాస్టల్స్ నిర్వాహకులు విద్యార్థుల జేబులను గుల్ల చేస్తున్నారు.

నగరంలో సుమారు 30 నుంచి 40 వరకూ హాస్టళ్లు ఉన్నాయి. చిన్నపాటి భవనాలను అద్దెకు తీసుకుని ఎలాంటి వసతులు లేకున్నా వాటిలోనే హాస్టల్స్‌ను నడుపుతూ జేబులు నింపుకుంటున్నారు. వీటివైపు ఇటు విద్యాశాఖ గానీ, మున్సిపల్ యంత్రాంగం గాని కన్నెత్తి చూసిన దాఖలాలు లేవనే విమర్శలు విన్పిస్తున్నాయి.

కనిపించని భద్రతా చర్యలు

జిల్లా కేంద్రంలో అధిక సంఖ్యలో బాలికల హాస్టల్స్ ఉన్నాయి. వీటిలో సగానికిపైగా హాస్టల్స్ వద్ద సరైన భద్రతా చర్యలు లేవు. కొన్ని బాలికల హాస్టళ్ల చెంతనే రాత్రి 11 గంటల వరకూ యువకులు హల్‌చల్ చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. సమయం సందర్భం లేకుండా హాస్టల్స్‌లోకి రాకపోకలు సాగిస్తున్నారని వాపోతున్నారు. ఫీజుల కోసం మాత్రమే హాస్టల్స్ నిర్వహించడం తప్ప వారి భద్రతలను ఎలాంటి చర్యలు లేవనే విమర్శలున్నాయి. ఏ హాస్టల్ వద్ద కూడా కనీసం వాచ్‌మేన్ కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. ముందుగానే అడ్వాన్సు కట్టించుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు విద్యార్థులు చెబుతున్నారు. వసతులు లేవని బయటకు వెళ్లిపోదామంటే ఫీజు తిరిగి ఇవ్వట్లేదని చెబుతున్నారు.

ఒక్కో చోటా.. ఒక్కోలా..

జిల్లా కేంద్రంలోని ఒక్కో హాస్టల్ ఒక్కోలా ఫీజు వసూలు చేస్తున్నారు. డీలక్స్ హాస్టల్ షేరింగ్ రూములో ఇద్దరు, ముగ్గురు నలుగురు ఉండేందుకు ఉచిత వైఫై, వాషింగ్ మిషన్, హీట్ వాటర్ వంటి వసతులు కల్పిస్తున్నామని ఊదరగొడతారు. దీంతో ఒక్కొక్క విద్యార్థి నుంచి నెలకు రూ.3 వేల నుంచి రూ.3,500 వరకూ వసూలు చేస్తున్నారు. హాస్టల్స్‌లో ఉండేందుకు ఒక ఫీజు, బోజనం చేసేందుకు ఒక ఫీజు, హాస్టల్స్‌లో అందిస్తున్న వసతుల కోసం మరొక ఫీజు వసూలు చేస్తున్నారు. దీంతో చాలా మంది తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి

జిల్లా కేంద్రంలోని అనేక ప్రైవేటు హాస్టల్స్‌లో భద్రత పరమైన లోపాలు ఉన్నాయి. హాస్టల్ విద్యార్థులకు రక్షణ కల్పించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. అనేక హాస్టల్స్‌లో నిర్వాహకులు కోరినంత ఫీజులు చెల్లించినా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం పెట్టడంలేదు. ఆలాగే కొన్ని రోజులే ఉన్నా నెల రోజుల ఫీజు వసూలు చేస్తున్నారు. ఇటువంటి హాస్టల్స్‌పై అధికారులు దృష్టి సారించాలి.

- వై.భాస్కర్, ఎస్ఎఫ్ఐ, జిల్లా అధ్యక్షులు

నిరసన తెలుపుతున్న ఎల్ఐసి సిబ్బంది

ఐడిబిఐ బ్యాంకును బలహీన పర్చొద్దు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

లాభాల బాటలో నడుస్తున్న ఐడిబిఐ బ్యాంకును డిసిన్వెస్ట్‌మెంట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచించడం సరియైన విధానం కాదని, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ అన్నారు. స్థానిక ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం ఎదుట ఎల్ఐసి యూనియన్ అధ్యక్షుడు ఎస్‌ఆర్‌జె.మాథ్యూస్ ఆధ్వర్యంలో ఐడిబిఐ బ్యాంక్ ఉద్యోగులు, అధికారుల దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావంగా సోమవారం నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి కోదండరామ్ మాట్లాడారు. దేశంలో 2,100 బ్యాంకు శాఖలతో రూ.4 లక్షల కోట్ల రిజర్వు నిధులతో ఐడిబిఐ పనిచేస్తుందన్నారు. 10 ఏళ్ల క్రితం నష్టాల్లో ఉన్న ఐడిబిఐని ఎల్ఐసి కొనుగోలు చేసి, దాన్ని లాభాల బాటలోకి తీసుకొచ్చిందన్నారు. మూడేళ్లలో రూ.10 వేల కోట్ల లాభాలు సాధించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.7,026 కోట్ల నిర్వహణ లాభాల్ని, రూ.209 కోట్ల నికర లాభాన్ని ఐడిబిఐ సాధించిందన్నారు. ఇంత గొప్పగా పని చేస్తున్న ఐడిబిఐని డిసిన్వెస్ట్ చేయాలనుకోవడం దారుణమన్నారు. అలాగే రీజనల్ రూరల్ బ్యాంకుల షేర్లు అమ్మడానికి ఐపిఒ విడుదల చేయాలని ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ఇది గ్రామీణ ప్రాంత ప్రజల పొదుపు, ఆకాంక్షలకు అనుగుణంగా లేదన్నారు. ఇన్సూరెన్స్ రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించాలని నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ఇలాంటి చర్యలను "జాయింట్ ఫ్రంట్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఇన్ ఫైనాన్షియల్ సెక్టార్" ఆధ్వర్యంలో తాము ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో యూనియన్ నాయకులు సత్యదేవ, పిఎస్ఎన్.రాజు, జి.శ్రీనివాసరావు, వి.ఈశ్వరరావు, భరణి, జిలానీ, పి.శ్రీనివాస్, స్వామి, మహిళా ఉద్యోగులు, రామలక్ష్మి, పివి.రమణ పాల్గొన్నారు.

సర్పంచ్ పద్మావతికి పూర్తి సహకారం

ప్రజాశక్తి-కడియం

పిన్న వయస్సులోనే కడియపులంక సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన మారిశెట్టి పద్మావతికి పూర్తి సహకారం అందించి, గ్రామాభివృద్ధికి తగిన తోడ్పాటునందిస్తామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికలో పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి దుర్గేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి నియోజకవర్గాన్ని అభివద్ధి పథంలో నడుపుతున్నారనానరు. ఆయన సహకారంతో పాటు తన సహకారం కూడ గ్రామాభివృద్ధికి ఉంటుందన్నారు. ఎన్నిక ఏకగ్రీవం అవ్వడానికి సహకరించిన కూటమి నాయకులు, ప్రతిపక్ష పార్టీ నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, కూటమి నాయకులు డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, మార్గాని సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు గట్టి నర్సయ్య, పుల్లా రామారావు, బొరుసు సుబ్రహ్మణ్యం, పంతం గణపతి, మార్గాని ఏడుకొండలు, ఎంపిటిసి సభ్యులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

మృతుని కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం మర్కొండపాడు గ్రామంలో ఇటీవల పొలం పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విధ్యుత్ తీగలు తగిలి సుంకవల్లి వెంకటరత్నం మృతి చెందాడు. వారి కుటుంబానికి విద్యుత్ శాఖ అందించే రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, ఎఎంసి ఛైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్‌చౌదరి, టిడిపి సీనియర్ నాయకులు ఆళ్ల హరిబాబు, సుంకవల్లి రమేష్, బండి శ్రీను, సొసైటీ అధ్యక్షులు మద్దిపాటి వీరరాఘవులు, పుసులూరి అనిల్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : కలెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్ని, మొక్కలను పెంచి పచ్చదనం పెంపునకు ప్రతినబూనుదామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం స్థానిక ఆర్ అండ్ బి కార్యాలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. పచ్చదనం పరిఢవిల్లితేనే మానవాళి మనగడ సాధ్యమవుతుందన్నారు. విషయాన్ని అందరూ గ్రహించాలన్నారు. మొక్కల పెంపకంతో కాలుష్యం తగ్గుతుందన్నారు. ప్రకతి వైపరీత్యాలను సైతం నివారించొచ్చన్నారు. వాతావరణ సమతుల్యతను కాపాడి, జీవ వైవిధ్యాన్ని పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఒక మొక్కను దత్తత తీసుకోవాలని పిలుపు నిచ్చారు. మొక్కలను నాటి వదిలేయకుండా వాటిని పరిరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని స్పష్టం చేశారు. 'అకిరా మియావాకి' పద్ధతిలో మొక్కలు నాటడం ద్వారా తక్కువ స్థలంలో దట్టమైన చిట్టడవిని సృష్టించొచ్చన్నారు. ఈ పద్ధతిలో మొక్కలు నాటడంపై ప్రజలలో విస్తత ప్రచారం కల్పించాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ శైలజవల్లి, ఇఇ మదర్సా అలీ, ఎడిహెచ్.స్వాతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాయం అందిస్తున్న స్నేహితులు

స్నేహితుల ఆపన్న హస్తం

ప్రజాశక్తి-కడియం

స్నేహానికి మరేదీ సాటి రాదని మరోసారి నిరూపించారు కడియం జిల్లా పరిషత్ పాఠశాల 1983-84 ఏడాది పదోతరగతి విద్యార్థులు. వారిలో కొంపెల్ల ప్రభాకరం కుమారుడు శరత్ చంద్ర(21)కు ఇటీవల లుకేమియా అనే వ్యాధి సోకినట్లు డాక్టర్లు నిర్ధారణ చేశారు. చికిత్సకు దాదాపుగా రూ.35 లక్షలు వరకు ఖర్చు అవుతాయని తెలిపారు. విషయం తెలుసుకున్న స్నేహితులు స్పందించిన ఆపన్న హస్తం అందించారు. ప్రస్తుత వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.30లక్షలు సేకరించారు. మండలంలోని కడియపులంకలో గల పల్ల వెంకన్న(పల్ల సత్యనారాయణ మూర్తి) నర్సరీ వద్ద సోమవారం బాధిత కుటుంబానికి నగదు అందజేశారు. మరింత సాయం అందిస్తామని స్నేహితునికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పల్ల సత్యనారాయణ మూర్తి, మార్ని సత్యనారాయణ, గుత్తుల సత్యనారాయణ, మహమ్మద్ సర్కార్ భాషా, కర్రి రాజు, జంగా సుబ్బారావు, తాడాల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమైక్యతను చాటేలా హర్ ఘర్ తిరంగా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జాతీయ సమైక్యతను చాటిచెప్పేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. హర్ ఘర్ తిరంగా ప్రచారంలో భాగంగా సోమవారం వై.జంక్షన్ నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు ఆర్ఎంసి అధికారులు, ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులతో ర్యాలీ నిర్వహించారు. తొలుత ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జాతీయ సమైక్యతను, సమగ్రతను కాపాడటం దేశ పౌరులుగా అందరి బాధ్యత అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగమైన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. నగర పౌరులు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెసి చిన్న రాముడు, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజవల్లి, డిప్యూటీ డైరక్టర్ రామారావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎస్ఇ ఎంసిహెచ్.కోటేశ్వరరావు, ఎంహెచ్ఒ వినూత్న తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

బిక్కవోలు : ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని అనపర్తి ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కాపవరం గ్రామంలో సోమవారం కూటమి నాయకులతో కలిసి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తహశీల్దార్ తదితరులు

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి - గోపాలపురం

సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సిపిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు కోసం సెప్టెంబర్ 1న తలపెట్టే చలో విజయవాడకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం తహశీల్దార్ అజయ్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం సిపిఎస్ ఉద్యోగుల కోసం మెరుగైన పెన్షన్ విధానం సూచిస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా నేటికీ సిపిఎస్‌పై మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దీనిపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ సహాయకులు హరీష్, ఆర్ఐ నాగసునీత, డిప్యూటీ తహశీల్దార్ సాంబశివరావు, సీనియర్ నాయకులు నల్లరాజు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎను కలిసిన సొసైటీల చైర్మన్లు

ప్రజాశక్తి - గోపాలపురం

ద్వారాకతిరుమల, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాలకు చెందిన సహకార సొసైటీలకు నూతనంగా ఎన్నికైన చైర్మన్లు సోమవారం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. పదవులను కేటాయించినందుకు ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సొసైటీల ద్వారా రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించి రైతుల అభివృద్ధికి, సొసైటీల అభివృద్ధికి కష్టపడి పని చేసి ప్రభుత్వానికి తగిన గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొర్లపాటి శ్రీరామచంద్రరావు, ఆంద్రు అనిల్, గోపాలపురం సొసైటీ అధ్యక్షులు వడ్లమూడి రమేష్, ఇతర మండలాల సొసైటీ చైర్మన్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రాపాక నుంచి మెట్టగంగాళమ్మ గుడి వరకు రూ.1.25 కోట్ల అంచనాతో నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం జాతీయ జెండాలను చేతబూని హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాగల్లు

కౌలు రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మల్లవరం యూనియన్ బ్యాంక్ మేనేజర్‌ను రైతులను వెంటబెట్టుకుని కలిశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు కంకటాల బుద్ధుడు, రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు మాట్లాడారు. కౌలు రైతులకు క్రాప్ లోన్ ఇబ్బందులను వివరించారు. భూ యజమాని క్రాప్ లోన్ తీసుకున్నందున కౌలు రైతులకి క్రాప్ లోన్ ఇవ్వబోమని చెప్పడం దారుణమన్నారు. పెట్టుబడి పెట్టి కౌలు రైతు సాగు చేస్తుంటే రుణాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. సిసిఆర్‌సి కార్డులున్నా రుణాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. అధికారులు స్పందించి కౌలు రైతులకు రుణాలు అందేలా చూడాలని ఆయన కోరారు.

నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న ఎంఎల్‌ఎ నెహ్రూ

ప్రజాశక్తి-గోకవరం

కొత్తపేటలో సోమవారం జరిగిన జగ్గంపేట నియోజకవర్గం మహిళా శక్తి సభ్యురాలు చెక్క మరియమ్మ కుమార్తె నిశ్చితార్థ వేడుకల్లో జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. కాబోయే వధూవరులు చెక్క లక్ష్మిశ్రీ, గొల్లపల్లి పవన్‌కుమార్‌లను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజవర్గ సీనియర్ నాయకులు మారిశెట్టి భద్రం, రుచి హోటల్స్ అధినేత నాగేంద్రచౌదరి, జడ్‌పిటిసి మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు, జగ్గంపేట నియోజవర్గ మహిళా అధ్యక్షురాలు కోట సత్యవతి, మండల ప్రధాన కార్యదర్శి గనుపే భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-నిడదవోలు

పట్టణంలో బసివిరెడ్డిపేట, రాయిపేటల్లో ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజల సంక్షేమ సంఘం అధ్యక్షులు జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాయిపేటలో 1941లో స్థాపించిన హిందూ ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్‌ను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల చాలా దయనీయమైన పరిస్థితిలో ఉందన్నారు. ఒక్కరే ఉపాధ్యాయుడు, ఎనిమిది మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వారిలో ఒక్కరు మినహా మిగిలిన వారు వైఎస్ఆర్ కాలనీ నుంచి వచ్చి చదువు కుంటున్నారని తెలిపారు. బసివిరెడ్డి పేటలో ఉన్న హిందూ ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాలలో ఆరుగురు మాత్రమే విద్యార్థులు ఉన్నారన్నారు. పట్టణంలో చాలా ప్రాముఖ్యత ఉన్న ఈ బసివిరెడ్డి పేట ఇందిరా నగర్, రాయిపేటల్లోని శ్రామిక ప్రజలు నివసించే ప్రాంతాల్లో పిల్లలు సంఖ్య కూడా ఎక్కువగా ఉందని, వీళ్ళందరికి అందుబాటులో స్కూల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్చేలా ప్రతిఒక్కరు చొరవ చూపాలని ఆయన కోరారు.

లక్ష్మీలావణ్యకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కష్టపడి చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన తాళ్లపూడి మండలం అన్నదేవర పేటకు చెందిన వికలాంగురాలు లక్ష్మీలావణ్యను కలెక్టర్ పి.ప్రశాంతి అభినందించారు. ఎపి అమరావతి ఓపెన్ స్కూల్ (సార్వత్రిక పీఠం) ద్వారా జారీ చేసిన ఉత్తీర్ణత ధ్రువపత్రాన్ని కలెక్టర్ ఆమెకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించొచ్చని దీనికి లక్ష్మీలావణ్య వంటి వారు ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. ఇటీవల జరిగిన 10వ తరగతి వార్షిక పరీక్షల్లో 500 మార్కులకు 345 మార్కులు సాధించిందన్నారు. ఇలాగే చదువు కొనసాగిస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆమెకు ప్రభుత్వం ద్వారా ప్రతినెలా రూ.15వేలు పించను అందిస్తున్నామని తెలిపారు. స్థానిక నాయకులు బూరుగుపల్లి రాఘవులు, ఆటో డ్రైవర్ రేలంగి సత్యనారాయణ లక్ష్మీలావణ్యకు సహకారం అందించడం ఆదర్శనీయమని అభినందించారు.

లక్ష్మీలావణ్యకు ధ్రువీకరణపత్రం ఇస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కార్టూ'నిజం'



సాగుకు విద్యుత్ గండం

డీ వార్మింగ్ మాత్రల పంపిణీకి సర్వం సిద్ధం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

నులి పురుగుల నివారణ మాత్రలను ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాఠశాలల్లోని క్లాసు టీచర్ల ద్వారా పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామని పిహెచ్‌సి వైద్యాధికారి బి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. తొలుత పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాత్రల పంపిణీకి సిబ్బంది పాటించాల్సిన వివరాలు వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్, ఎంపిడిఒ వివివిఎస్.రామారావు, ఇఒపిఆర్‌డి ఆంజనేయశర్మ, ఎంఇఒలు సిహెచ్.సక్సేనారాజు, డి.శారదాజ్యోత్స్న, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, టిఎ కాంతారావు, సిహెచ్ఒ సుబ్రహ్మణ్యం, పిహెచ్ఎన్ కెడివిఎల్ఎన్.కుమారి, సూపర్‌వైజర్లు శ్రీరామమూర్తి, రత్న కుమారి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

గోకవరం : కొత్తపల్లి పిహెచ్‌సి పరిధిలోని అన్ని విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ ఏర్పాటు పూర్తి చేశామని వైద్యాధికారి డాక్టర్ తిరన్ తెలిపారు. మండలంలో 13,358 మందికి వైద్య ఆరోగ్య సిబ్బంది ఈ మాత్రలను వేస్తారన్నారు. ఆగస్టు 12న మాత్రలు తీసుకోని పిల్లలకు ఆగస్టు 20న రెండో దఫాలో అందిస్తామన్నారు. జ్వరం ఇతర అనారోగ్యంతో ఉన్నవారికి తప్ప మిగిలిన అందరికీ మాత్రలు ఇస్తారని తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తహశీల్దార్, ఎంపిడిఒ

నల్లజర్ల : చిన్నారుల్లో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న నులిపురుగులును నివారించి, ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండ వేయించాలని నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ తెల్లం గంగాధరరావు అన్నారు. సోమవారం ఆయన పిహెచ్‌సి పరిధిలోని విద్యాసంస్థలకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సింహాద్రిరావు, ఎంఇఒ సత్యనారాయణ సమావేశమయ్యారు. మంగళవారం నాడు నిర్వహించే ఈ కార్యక్రమంలో 19 ఏళ్లలోపు పిల్లలతో మాత్రలు మింగించాలన్నారు. 14,148 విద్యార్థులకు మాత్రలు వేస్తామన్నారు.

గోపాలపురం : ఈనెల 12న జాతీయ నులిపురుగుల నిర్మూలన నివారణ దినోత్సవంగా నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాన్ని నూరు శాతం విజయవంతం చేయాలని అన్నదేవరపేట, హుకుంపేట పిహెచ్‌సి వైద్యులు స్వర్ణలత, గాయత్రి పిలుపునిచ్చారు. సోమవారం వైద్యులు స్వర్ణలత మాట్లాడుతూ అన్నదేవరపేట పరిధిలో అంగన్వాడి, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు ,కళాశాలలు 99 ఉన్నట్లు తెలిపారు. 1-19 సంవత్సరంలోపు పిల్లలు, విద్యార్థులు 7631 మంది ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా హుకుంపేట పరిధిలో అంగన్వాడీలు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో కళాశాలలో 57 ఉన్నట్లు తెలిపారు. ఆసుపత్రి పరిధిలో 5063 మంది ఉన్నారన్నారు.

నేరాలు ఘోరాలు

అధికారులు సీజ్ చేసిన లారీ

25 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - రాజానగరం

అక్రమంగా తరలిస్తున్న 25 టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, పౌర సంబంధాలు, రవాణా శాఖ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. జాతీయ రహదారి పాలచర్ల సమీపంలో చెరుకూరి క్రషర్ వద్ద బియ్యాన్ని తరలిస్తున్న లారీని సోమవారం పట్టుకున్నారు. నల్లజర్ల నుంచి కాకినాడ పోర్ట్‌కు తరలిస్తున్నట్టు గుర్తించారు. గత నెలలో 6ఎ కేసు నమోదు చేయగా బియ్యాన్ని గ్రామానికి తీసుకెళ్తున్నట్టు యజమాని చెప్పాడని అధికారులు తెలిపారు. దీనిని కాకినాడ కలెక్టర్ ధ్రువీకరించాల్సి ఉందన్నారు.రికార్డులు పరిశీలించిన అనంతరం ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని చెప్పారు. ప్రస్తుతం లారీని సీజ్ చేశామని, డ్రైవర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని చెప్పారు. బియ్యం విలువ రూ.11.50 లక్షలు, లారీ విలువ రూ.10లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ తహశీల్దార్ పవన్ కుమార్, సహాయ పౌరసరఫరాల అధికారి నాగాంజనేయులు, మండల పౌర సరఫరాల అధికారి గులుగూరి బాపిరాజు, ఆర్‌టిఒ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గర్భిణి మృతి

ప్రజాశక్తి-కడియం

కడియంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. మండలంలోని బుర్రిలంక గ్రామం వైపు నుంచి కడియం మీదుగా వేమగిరి వెళుతున్న టిప్పర్ కడియం దేవి సెంటర్ వద్ద రోడ్డుపై నడుస్తున్న మహిళను ఢీకొట్టింది. ప్రమాదంలో రాజానగరం మండలం కొత్త తుంగపాడు గ్రామానికి చెందిన గర్భిణీ చిక్కిరెడ్డి సరోజిని(28) తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు ఆమెను కడియం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయింది. సరోజినీ తన చెల్లెలు సత్యతో కలిసి బ్యాంకులో ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించుకుని తిరిగి వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సత్యకు ఎటువంటి గాయాలు కాలేదు. ప్రమాదంపై కడియం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

3 టన్నుల సల్ఫేట్ ఎరువుల సీజ్

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో ఎడిఎ ఎన్.దైవ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఎరువులు, పురుగు మందుల దుకాణాలను వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు సందర్భంగా ఒక షాపులో లైసెన్స్ గడువు ముగిసినా అక్రమంగా నిల్వ ఉన్న మూడు టన్నుల అమ్మోనియం సల్ఫేట్ ఎరువుని సీజ్ చేసినట్లు దైవకుమార్ తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కె.సంజయ్ కుమార్, ఎఇఒ ఎన్‌వివి.ప్రసాద్, టెక్నికల్ ఎఒ శ్రీనివాసరావు, విఆర్‌ఒలు లోవలక్ష్మి, కిరణ్ పాల్గొన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీలు

చోరీ కేసులో నలుగురు అరెస్టు
2 లారీలు, సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి-పిఠాపురం

రెండు లోడ్ లారీలను అపహరించిన కేసుల్లో నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.56,49,926 సొత్తు, రెండు లారీలు స్వాధీనం చేసుకున్నట్లు పిఠాపురం సిఐ జి.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో పాత్రికేయుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 5న రూ.26,83,026 విలువైన ఫ్రీడం సన్ ఫ్లవర్ ఆయిల్ లోడ్ లారీని స్థానిక కుంతీ మాధవ స్వామి గుడి ముందు ఉంచి ఇంటికి వెళ్లి ఉదయం వచ్చి చూసుకోగా... లారీని అపహరించినట్టు కాకినాడ డైరీ ఫారం సెంటర్‌కు చెందిన దగ్గు అప్పారావు ఫిర్యాదు చేశారు. డ్రైవర్స్ కాలనీలో నూకల లోడ్‌తో ఉన్న లారీని అపహరించినట్టు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఎస్‌పి పర్యవేక్షణలో 5 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి నిందితులను గుర్తించారు. చేబ్రోలులో బెల్లంకొండ రవితేజ, నాగిరెడ్డి నాగ సతీష్, గంజి సురేష్, నందిపాటి సుబ్రహ్మణ్యంను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి లారీలను, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో ఎస్‌లు మణికుమార్, జాన్ బాషా, రామకృష్ణ, వెంకటేష్, క్రైం పోలీసులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

ప్రజాశక్తి - రాజానగరం

జాతీయ రహదారి దివాన్ చెరువు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి చెందింది. గండేపల్లి మండలం కె.గోపాలపురానికి చెందిన జనపరెడ్డి సత్యనారాయణ భార్య రాఘవ (55)తో కలిసి బైకుపై రాజమహేంద్రవరం మార్కెట్‌కు సోమవారం బయలుదేరారు. వారు జాతీయ రహదారిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్దకు చేరుకునే సరికి వెనుక నుంచి మరో బైకు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో రాఘవ తలకు బలమైన గాయమైంది. ఆమెను వెంటనే 108లో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

పొక్లెయినర్లు, లారీలు సీజ్

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం మండలం పాతతుంగపాడు గ్రామంలో సర్వే నంబర్లు 733, 727లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్న రెండు పొక్లెయినర్లు, రెండు లారీలను సీజ్ చేశామని గనులు, భూగర్భ శాఖ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రెవెన్యూ అధికారులు అప్పగించామన్నారు. అక్రమ తవ్వకాలు జరగకుండా ఈ ప్రాంతాల్లో కొలతలు వేసి పటిష్టతా చర్యలు తీసుకున్నామన్నారు.

యానాం వార్తలు

ఆర్‌టిఒను కలిసిన టాక్సీ యూనియన్ సభ్యులు

ప్రజాశక్తి - యానాం

యానాం నూతన ఆర్‌డిఒ అరుళ్‌జగన్‌ను యానాం టాక్సీ ఓనర్స్ కం డ్రైవర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రెసిడెంట్ సులేమాన్, మాజీ ప్రెసిడెంట్ కుంచే సత్యనారాయణ మాట్లాడుతూ యానాంలో కొంతమంది సొంత వాహనాలు టాక్సీ రూపంలో తిప్పుతున్నారని, బయట నుంచి కొన్ని వాహనాలు యానాంలో పర్మిట్ లేకుండా తిరుగుతున్నాయని వాటిని అరికట్టాలని కోరారు. వాటిని అరికడితేనే తమ జీవనాధారం మెరుగు పడుతుందని ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో మధుబాబు, పెదబాబు, ఇళ్ల వాసు, సత్తిబాబు, రేవు విష్ణు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - యానాం

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మేరా యువభారత్ ఆధ్వర్యంలో స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆర్‌ఎఒ మునిస్వామి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంకు రుణాలు, మహిళలకు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.కృష్ణ సుధాకర్, జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, పుదువై బ్యాంక్ మేనేజర్ సుజని కమల, ఎల్‌ఐసి బ్రాంచ్ మేనేజర్ ఎస్‌విఎస్ ప్రసాద్, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ జగదీష్, మిషన్ శక్తి కో ఆర్డినేటర్ రిప్కా రోస్లిన్ పాల్గొన్నారు.

పుదుచ్చేరిలో ఆందోళన చేస్తున్న యానాం దళిత నాయకులు

జిఒ 5ను ఉపసంహరించాలని ఆందోళన

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి గెజిట్ విడుదల చేసిన జిఒ 5 లోని కొన్ని నిబంధనలు దళితుల సంక్షేమాలను నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయని, ఆ నిబంధనలను తక్షణమే తొలగించాలని దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో పుదుచ్చేరిలో ఆందోళన చేపట్టారు. తొలుత ర్యాలీగా బయలుదేరి అసెంబ్లీ సమీపంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒలో పలు నిబంధనలు పొందుపరచడం వల్ల దళిత సంక్షేమానికి, అభివృద్ధికి, ఉపాధికి తీవ్ర నష్టం వాటిల్లే విధంగా ఉందని దళితుల సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసే విధంగా ఈ నిబంధనలు ఉన్నాయన్నారు. తక్షణమే ప్రభుత్వం ఈ నిబంధనలు తొలగించే విధంగా చర్యలు తీసుకోకపోతే తీవ్ర స్థాయి ఆందోళన చేపడతామని డిమాండ్ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి ఎన్ రంగసామి, గవర్నర్ కైలాస్ నాథన్‌లను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పొనుగుమట్ల విష్ణుమూర్తి, గిడ్డి బలరామ్, కమిడి విజయ్ కుమార్, తిరుకోటి నాగేశ్వరరావు, లంక బంగారం, బోళ్ల జోజి, యాళ్ల వెంకట కుమార్, సబ్బతి శ్రీనివాసరావు, ఎస్.లోకేష్, మెల్లం శ్రీనివాసరావు, పి.వెంకటరావు పాల్గొన్నారు.

గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్లాడి కృష్ణారావు

గవర్నర్‌ను కలిసిన మల్లాడి కృష్ణారావు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాసనాథన్‌ను సోమవారం కలిశారు. యానాంలో పెండింగ్ సమస్యలపై చర్చించి వినతిపత్రం అందజేశారు. యానాం, మాహే ప్రాంతాల్లో సంక్షేమ పథకాలను ప్రాతిపదికగా తీసుకుని మినిస్టీరియల్ సిబ్బంది, ఎల్‌డిసి, యుడిసి సూపరింటెండెంట్, జెఎఒలను తగిన నిష్పత్తిలో నియమించాలని కోరారు. యానాం విద్యాశాఖ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో ప్రభుత్వం ప్రకటన మేరకు దరఖాస్తు చేసిన పిఎస్‌టిలతో పాటు విల్లింగ్‌నెస్ ఇచ్చిన పాతవారికి అవకాశం ఇవ్వాలని కోరారు. హౌసింగ్ స్కీమ్ ద్వారా ఉచిత గృహ నిర్మాణం నిమిత్తం ఇచ్చే నగదు మంజూరుకు వినతిపత్రాలు ఇచ్చినట్టు గుర్తు చేశారు.

ఆందోళన చేస్తున్న వధువు బంధువులు

కొద్ది గంటల్లో పెళ్లి... వరుడు పరార్

ప్రజాశక్తి-దేవరపల్లి

కొన్ని గంటల్లో వివాహం అనగా వరుడు పరారయ్యాడు. దీంతో న్యాయం చేయాలని వధువు కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటన దేవరపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. యాదవోలు గ్రామానికి చెందిన పాల మూలస్వామి కుమారుడు పాలి వీరవెంకట సత్యనారాయణకు బీమోలు గ్రామానికి చెందిన యువతితో వివాహానికి నిశ్చయించారు. సోమవారం తెల్లవారుజాము 3 గంటలకు పెళ్లి ముహూర్తం సైతం పెట్టుకున్నారు. రెండు కుటుంబాలు పెళ్లికి సన్నద్ధమయ్యారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో వివాహ వేదిక అయిన శివ ఫంక్షన్ హాల్ వద్దకు పెళ్లికుమార్తెతో కుటుంబ సభ్యులు బయలుదేరారు. ఈ సమయంలో వరుడు బంధువుల నుంచి వధువు కుటుంబ సభ్యులకు ఫోన్ వచ్చింది. వరుడు లేడని, ఎక్కడికో వెళ్లిపోయాడని చెప్పారు. వధువు తరుపు బంధువులు అందరూ కలిసి యాదవోలు గ్రామం వెళ్లగా అక్కడ పెళ్ళికొడుకు, అతని కుటుంబ సభ్యులు ఎవరూ లేరు. దేవరపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఉన్నట్టు సమాచారం అందడంతో వారంతా అక్కడకి వెళ్లారు. అప్పటికే పాలి వీర వెంకట సత్యనారాయణతో తనకు వివాహమైందంటూ ఒక యువతి పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టినట్టు గుర్తించారు. విషయం తెలుసుకున్న పెళ్లి కుమార్తె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని కుటుంబ సభ్యులు తెలిపారు. తగిన న్యాయం చేయాలంటూ వారు దేవరపల్లి పోలీసులను ఆశ్రయించారు. నిత్య పెళ్లి కొడుకుపై చర్యలు తీసుకోవాలని బ్యానర్ పట్టుకుని ఆందోళన చేశారు. కేసు నమోదు చేశామని దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేస్తామని దేవరపల్లి సిఐ నాయక్ తెలిపారు.

వాతావరణాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ (జెనీవా) సహకారంతో 'ఆంధ్రప్రదేశ్ క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్'ను సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆర్ట్స్ కళాశాలలో 100 మంది వాలంటీర్లను ఎంపిక చేసి, వారికి ప్రత్యేకంగా రూపొందించిన టీ-షర్టులు, క్యాప్‌లు అందజేశారు. ప్రతి వాలంటీర్ తమ పరిసర ప్రాంతంలోని పది గృహాలను దత్తత తీసుకుని, వాయు కాలుష్యం, నీటి కాలుష్యం నివారణ, చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్ నిషేధం, చెట్లు నాటడం వంటి పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ గ్రూపును కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న వాతావరణాన్ని కాపాడుకునే దిశగా ఆంధ్రప్రదేశ్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో ఉన్నతమైందన్నారు. ఈ కార్యక్రమాన్ని యూత్ రెడ్ క్రాస్ కో-ఆర్డినేటర్ జి.రవితేజ ఆధ్వర్యంలో నిర్వహించారు. లెఫ్టినెంట్ భాషా పాల్గొన్నారు

రెడ్‌క్రాస్ సభ్యులు

సింగపూర్ తెలుగు గోల్డెన్ జూబ్లీకి మంత్రి దుర్గేష్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి-కడియం

సింగపూర్‌లో తెలుగు సాంస్కృతిక సమితిని స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 31 గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. సింగపూర్ తెలుగు సమాజం అధ్యక్షులు బి.శ్రీనివాసులు రెడ్డి ఈ మేరకు మంత్రి కందుల దుర్గేష్‌కు ప్రత్యేక ఆహ్వానం పంపించారు. తెలుగు సమాజం ప్రతినిధులు అద్దంకి రాజాయోనా, చిలుకూరి శ్రీనివాసరావు సోమవారం వీటిని మంత్రికి అందజేశారు. సింగపూరు మెరీనా బే సమీపంలో జరిగే ఉత్సవాలకు ప్రపంచ వ్యాప్తంగా ఉండే అనేకమంది తెలుగు ప్రముఖులు పాల్గొంటారని శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రికి ఆహ్వాన పత్రాన్ని అందించిన వారిలో మాధవరాయుడుపాలెం సర్పంచ్ ఆన్నందేవుల చంటి, చెళ్లపిళ్ల వెంకట శాస్త్రి కళా సమితి ప్రతినిధి ఉంగరాల వీరభద్రరావు తదితరులున్నారు.

.రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - బిక్కవోలు

కాపవరం నుంచి దుప్పలపూడి వరకూ రూ.2 కోట్లతో నిర్మించే బిటి రోడ్డు నిర్మాణ పనులకు ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వైద్య సిబ్బంది వినతి

ప్రజాశక్తి - జగ్గంపేట

తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూకు వినతిపత్రం అందజేసి కోరారు. సోమవారం స్థానిక నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో తెలుగు నాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు యల్లపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎను కలిసి సిబ్బంది సమస్యలను వివరించారు. సచివాలయంలో ఎఎన్‌ఎంలను వైద్య, ఆరోగ్య శాఖ విధులు కాక మిగతా శాఖల విధులకు వినియోగిస్తున్నారని, వాటి నుంచి తప్పించాలని కోరారు. రెండో ఎఎన్‌ఎంలకు చాలా కాలంగా జీతాలు పెంచలేదని, వారికి జీతాలు పెంచే విధంగా సహకరించాలని కోరారు. కె.శ్రీనివాస్, రాజా, ప్రకాష్, వై.శ్రీను, ఎస్‌కెవిడి.లక్ష్మి పాల్గొన్నారు.

కరాటే పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 27 నుండి 29 వరకు హర్యానాలోని కురుక్షేత్రంలో జరిగే జాతీయస్థాయి కరాటే పోటీలకు పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 10న తిరుపతిలో జరిగిన 5వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో అండర్ 14 బాలురు విభాగంలో కుమితే పోటీలో తెప్పల యోగేష్, అండర్ 14 బాలికల విభాగం లో కుమితే పోటీలో సహస్ర, అండర్ 12 బాలుర విభాగంలో కుమితే పోటీలో పాసిల లోకేష్ విజయం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్, అధ్యక్ష కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ కుమార్, దుంగల పూజిత సూర్యశ్రీ అభినందించారు.

పెన్షనర్స్, వాకర్స్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

ప్రజాశక్తి - జగ్గంపేట

పెన్షనర్స్, వాకర్స్ ఆధ్వర్యంలో సోమవారం రిటైర్డు అసోసియేషన్ భవనం వద్ద నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో విశ్రాంతి ఉద్యోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. రాజమండ్రి అకిరా ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఆపరేషన్ల కోసం రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తోలేటి సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మంచాల మల్లేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు చంద్రమౌళి వెంకట శాస్త్రి, సభ్యులు తమటం నాగేశ్వరరావు, డివిడి ప్రసాద్, మొగలి రామలింగేశ్వరరావు, ఇళ్ల బుద్దాజీ, వాకర్స్ హెల్త్ క్లబ్ జోనల్ చైర్మన్ వెత్సా నాగసత్య, క్లబ్ ఉపాధ్యక్షుడు ఉదయ భాస్కర్ చౌదరి, సీనియర్ వాకర్ రెడ్డి సుబ్బారాయుడు, బొండా వీర సత్య పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పరిశీలన

ప్రజాశక్తి - జగ్గంపేట

ఇండోర్, ఔట్ డోర్ రెండు గ్రౌండ్లనూ అభివృద్ధి చేస్తామని టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిర్మించిన ఇండోర్ స్టేడియం ప్రాంతాన్ని ఆయన అధికారులు, సాన సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఇండోర్ స్టేడియం వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని క్రికెట్ గ్రౌండ్‌కు సరిపోతుందా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నవీన్ మీడియాతో మాట్లాడుతూ ఇండోర్ స్టేడియంలో మిగిలి పోయిన పనులు పూర్తి చేసేందుకు సహకరించాలని రాజ్యసభ సభ్యులు సాన సతీష్ బాబును కోరామన్నారు. ఆయన ఫౌండేషన్ చైర్మన్‌ను పంపించారని ఇండోర్ స్టేడియంను ఫౌండేషన్ ద్వారా అభివృద్ధి చేస్తామని చెప్పారన్నారు. ఆయన వెంట పంచాయితీ రాజ్ డిఇ ఉమాశంకర్, ఎఇ నారాయణ, టిడిపి నాయకులు దేవరపల్లి మూర్తి, జీను మణిబాబు, హరి, పాండ్రంకి రాంబాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు, రాయి సాయి పాల్గొన్నారు.

నాయకుల అరెస్టు అప్రజాస్వామికం

ప్రజాశక్తి - గోపాలపురం

ఇండియా కూటమి నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జ్యేష్ఠ సతీష-బాబు అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ఇతర ఇండియా కూటమి నాయకుల అరెస్టు బిజెపి పిరికిపంద చర్య అని విమర్శించారు. రాహుల్ గాంధీ ఎలక్షన్ కమిషన్ చేసిన తప్పులను పూర్తిగా సాక్ష్యాదారాలతో 70 నిమిషాల పాటు భారతదేశ మీడియా ముందు ఉంచితే దానికి సరైన సమాధానం చెప్పలేక ఎలక్షన్ కమిషన్, బిజెపి ఈ అరెస్టులకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. ఒకే వ్యక్తి ఒకే ఓటు అనే నినాదంతో రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి యావత్ భారతీయులందరూ మద్దతు పలకడంతో బిజెపి ప్రభుత్వం ఏం చేయాలో తోచక అక్రమ అరెస్టులకు పాల్పడిందన్నారు.

లైసెన్సు రహిత ప్రయాణం చట్ట విరుద్ధం

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం చట్ట విరుదద్ధమని, ద్విచక్ర వాహన చోదకులు మితిమీరిన వేగంతో నడిపితే జరిమానా విధిస్తామని ఎస్‌ఐ డి.రవికుమార్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని పాలంగి కనకదుర్గ ఆలయం వద్ద, ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిబుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, చేస్తే తప్పనిసరిగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన పత్రాలన్నీ వాహనంతో పాటు భద్రంగా ఉంచుకోవాలన్నారు. అధికారులు అడిగినప్పుడు వాహనాలకు సంబంధించిన పత్రాలను చూపించాలని సూచించారు. మైనర్లకు వాహనాలను ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. లైసెన్స్ రహిత ప్రయాణం చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

తనికీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలను చేతబట్టుకుని భారత్ కు జై అంటూ నినదించారు. మానవహారాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా జడ్జి, కాకినాడ వారి కోర్టులో
ARB E.P. 602 of 2024 in ARBITRATION CASE No.380 of 2020
Between:
M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్) కాకినాడ, సర్పవరం బ్రాంచ్ తరపున రికవరీ మేనేజర్ మరియు స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ దుర్గాప్రసాద్ పి.ఎస్.ఆర్. ...డి.హెచ్.ఆర్
మరియు
1. **మేడిశెట్టి భాస్కరరావు,** తండ్రి: లక్ష్మణరావు, వయస్సు 38 సం॥రం॥లు, వ్యాపారం, డోర్ నెం.2-11, పెనుమర్తి, తిమ్మాపురం, కాకినాడ రూరల్ మండలం, కాకినాడ జిల్లా-533005
2. **కుర్రా మల్లేశ్వరరావు,** తండ్రి: సత్యనారాయణ, వయస్సు 42 సం॥రం॥లు, వ్యాపారం, డోర్ నెం.2-72/బి, లంక వారి వీధి, తిమ్మాపురం, కాకినాడ రూరల్ మండలం, కాకినాడ జిల్లా-533005 ...జె.డి.ఆర్స్

పై నెంబరు గల ఆర్బిట్రేషన్ అవార్డ్ తాలూకు సొమ్మును వసూలు ఇప్పించవలసిందిగా కోరుతూ డి.హెచ్.ఆర్. దాఖలు చేసిన ఇ.పి.లో 1వ జె.డి.ఆర్./ప్రతివాదికి మహారాజశ్రీ పైన తెలిపిన కోర్టు వారు పలుమార్లు 0.21 Rule 37 C.P.C ప్రకారం నోటీసులు పంపినప్పటికి సదరు 1వ జె.డి.ఆర్. తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. పై నెంబరు ఇ.పి. **19-08-2025** తేదీన వాయిదా అయి ఉన్నది. కావున మీరు పై తేదీన, పైన తెలిపిన కోర్టులో ఉదయం 10.30 ని॥లకు హాజరై ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని ఎడల పై ఇ.పి. తమ పరోక్షమున తీర్మానము చేయబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
పుట్రేవ్ అజేయ్‌కుమార్,
కడలి దుర్గార్జున్, అడ్వకేట్స్,
కాకినాడ మహమ్మద్ అలీ వీధి, గాంధీనగర్,
ది.11-08-2025 కాకినాడ. సెల్: 94944 85234

IN THE COURT OF THE VI ADDITIONAL JUNIOR CIVIL JUDGE, KAKINADA
I.A. No.5 / 2022 in O.S.No.754/2021
Between:
Karri Venkata Madhusudan Reddy ...Petitioner
and
1) Pepakayala Srinivasa Rao (Plaitiff)
2) Panthula Veera Venkata Rama Lakshmi Kameswari, W/o. Suresh, 43 years, Hosuewife, R/o. D.No.3-89, Gadamvari Street, Chandrampalem Village, Samalkot Mandal, East Godavari District, A.P., Kakinada JCJ (Defendant)
... Respondents

Whereas the **2nd Respondent/ Defendant** is hereby requested to appear before the above referred Hon'ble Court at **10.15** a.m. on **28-08-2025** in I.A. 5/2022 in O.S. 754/2021 to contest the same. If fail to appear, you will be set exparte and the matter will be heard in your absence and proceed further.
Chinnam Saibaba Reddy
Advocate, D.No.3-16C-6, Shanti Nagar
Kakinada Kakinada - 533 003, A.P.
Dt.10-08-2025 Cell: 9440178894

దస్తావేజులు పడిపోయినవి

నీలాపు వెంకటేశ్వరరావు గారు దివి.28-05-2011 సం॥తేదీలో డోనెం.20-501యర్రకొండ, ధవిళేశ్వరం కు చెందిన దానిని రిజిష్టర్డు దస్తావేజు **నెం.2232/2011లో** సింహాద్రి అనంతలక్ష్మి, సింహాద్రి శివరామ్ గార్ల వద్ద నుండి కొనుగోలు చేసినారు. సదరు నీలాపు వెంకటేశ్వరరావు సదరాస్తిని నాకు రిజిష్టర్డు **గిఫ్ట్ డిడ్‌నెం.4202 of 2025** లో స్వాధీనపర్చినారు. **దివి.07-08-2025సం॥ము** తేదీన ఉదయం సుమారు **10.00గం॥లకు** నేను సదరు దస్తావేజులు కలర్ జిరాక్స్ తీయించు నిమిత్తం నా ఇంటి నుండి యర్రకొండ మీదుగా ధవిళేశ్వరం జిరాక్స్ షాపుకు వచ్చుచుండగా లింకు దస్తావేజు **2232/2011(SROకడియం)** మార్గమధ్యమంలో పడిపోయినది. ఎంతవెతికినా ఆ దస్తావేజు దొరకలేదు. ఎదరికైనా సదరు దస్తావేజు దొరికిన వెంటనే నాకు తెలియచేయండి.
బంగారు రవిచంద్ర
యర్రకొండ, డోనెం.20-501
ధవిళేశ్వరం, సెల్.8008446633

సెటిల్ మెంట్ దస్తావేజులు పోయినవి

డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా , కొత్తపేట మండలం, కొత్తపేట గ్రామ కాపురస్తులు సలాది స్వామి నాయుడు గారి కుమార్డు ధన బ్రహ్మజీ ఈ క్రింది ఉదహరించిన రిజిష్ట్రీ దస్తావేజులు తీసుకొని కొత్తపేట మా ఇంటినుండి బయలుదేరి జిరాక్స్‌లు తీసుకొనే నిమిత్తం ఆస్తికి సంభంధించిన **సెటిల్ మెంట్ దస్తావేజు ది.20-08-2007 సం॥ (నెం.1020/2007)** మరియు పూర్వపు **సెటిల్‌మెంటు దస్తావేజు ది.31-08-2007 (డా.నెం.1034/2007)** మోటారు సైకిల్ ముందు భాగములో గల కవరులోనేఉంచి స్టేట్ బ్యాంక్ లోనికి వెళ్లినాను, నేను తిరిగి వచ్చిన తరువాత సదరు దస్తావేజు కనబడి ఉండలేదు. ఆ సంధర్భములో నేను వాకాబు చేయగ సదరు పైన ఉధహరించిన దస్తావేజు కనబడలేదు. కావున ఏవన్మందికి తెలియ జేయునది ఏమనగా, సదరు దస్తావేజులు గూర్చి తెలిసినయెడల నాకు తెలలియజేయవలసినదిగా కోరి ప్రార్ధిస్తున్నాను.
సలాది ధన బ్రహ్మజి
సెల్.9177077666

ఫార్మెటివ్-1 పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రభుత్వము ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు మూల్యాంకన పుస్తకాల్లో పరీక్షల నిర్వహణ ప్రారంభించిందని అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్ తెలిపారు. స్థానిక శ్రీ నాగరాజా నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఫార్మెటివ్-1 పరీక్షలను ఆయన సోమవారం పరిశీలించారు. విద్యార్థులు రాస్తున్న మూల్యాంకన పుస్తకాలను పరిశీలించి సూచనలు చేశారు. లీప్ యాప్‌లో సబ్జెక్ట్ టీచర్ మ్యాపింగ్, క్లాస్ టీచర్ మ్యాపింగ్ ముందుగానే పూర్తి చేయాలన్నారు. గతంలో పరీక్షలు రాసే విధానం కన్నా ఇప్పుడు మూల్యాంకన పుస్తకంలో పరీక్షలు రాయడం విద్యార్థులకు సౌలభ్యంగా ఉన్నదా? లేదా? అని విద్యార్థులను అడిగి ఆరా తీశారు. అసెస్మెంట్ పుస్తకంలో అన్ని వివరాలు సక్రమంగా నమోదు చేయాలని, ముఖ్యంగా సబ్జెక్ట్ కోడ్‌లు జాగ్రత్తగా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు టి.చక్రధర్, ఉపాధ్యాయులు ఎన్ రవిబాబు,జి రవి పాల్గొన్నారు.

మహారాశ్రీ అమలాపురం సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.P.No.6 of 2025
Between:-
మోటిపల్లి సత్య కృష్ణ ప్రసాద్ ...పిటీషనర్
మరియు
సుందరనీడి నారాయణ మూర్తి @ బాబులు మరియు ఇతరులు ...రెస్పాండెంట్లు
పై నంబరు కేసులో పిటీషనరు తనను ఇన్ సాల్వెంటుగా డిక్లేర్ చేయవలసినదిగా కోర్టులో పిటిషన్ దాఖలు చేసి యున్నారు. కావున ఇందు విషయమై ఎవరికైనను ఆక్షేపణలు ఉన్న యెడల వారు **ది.19-08-2025** తేది ఉదయం **10.30** ని॥లకు కోర్టువారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హజరై తెలియ పరచవలెను. లేనిచో పరోక్షమందు తీర్మానించబడును.
వాయిదా తేది 19-08-2025
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
భూసారపు బ్రహ్మ ఏసుబాబు@ సుభాష్ & అసోసియేట్లు,
అమలాపురం అమలాపురం
ది.11-08-2025 సెల్.9491707789

మహారాజశ్రీ ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రామచంద్రపురం
IA 618/2024 in O.S.376/2024
Between:-
అములోజు నాగేంద్ర ప్రకాష్ ...పిటిషనర్/వాది
మరియు
శ్రీ కస్తూరి రాజగోపాల కృష్ణమోహన్, S/o. వెంకటరాజు, వయసు 62సం॥లు, రిటైర్డ్ SGT,టీచర్, R/o.D.No.12-8-38/1,చల్లవారి వీధి, రామచంద్రపురం, రామచంద్రపురం మండలం, డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసమ జిల్లా, ఆంధ్రప్రదేశ్.
...రెస్పాండెంట్/ప్రతివాది
ప్రకటన
మీకు పై నెంబరు కేసులో వాది తరపున కోర్ట్ వారి ఆర్డర్ పై ఎన్ని పర్యాయములు మీకు నోటీసులు పంపినను, మీరు బుద్ధిపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు నోటీసు ఆర్డరు వేశారు. మీరు **19-08-2025** తేదిన కోర్టు వారి ఎదుట ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని లేదా లాయరు ద్వారా గాని హాజరు కావలెను. లేని యెడల శ్రీ కోర్టు వారు పరోక్షంగా తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
సూరంపూడి గంగాధరం
ఆనాల గంగాభవాని
అడ్వకేట్స్, రామచంద్రపురం
సెల్.8974474956

మహారాజశ్రీ విజయనగరం ప్రధాన జిల్లా జడ్జివారి కోర్టులో
MVOP 399/2024
Between:
Barri Lakshmi and others ....Petitioners
And :
P.Naga Suribabu and others ......Respondents
Notice to
R2) Reddika Pattabhi, S/o Ramanna, D.No. 50-5-5/1, Sattemmathalli Gudi Street, Jagannaik Pur, Kakinada, AP State-535001
పై నెంబరు పిటిషనులో మీకు పై కోర్టు నుండి నోటీసులు పంపినా మీరు తీసుకోనందున పై కేసు మీకు నోటీసు నిమిత్తం తే 19-8-2025దీకి వాయిదా వున్నది. పై కేసులో మీకు అభ్యంతరములున్న ఎడల **తే 19-8-2025దీన ఉదయం 10-30 గం॥లకు** పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను. లేనిచో పై పిటిషను మీ పరోక్షమందు తీర్మానించబడును.
ఇట్లు
J.Bheemasena Rao
J.Vamsi Krishna Mohan
Advocate for Petitioners,
Vizianagaram,
Cell: 9441053628

ప్రకటన
మహారాజశ్రీ గౌరవ నీయులైన జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ప్రత్తిపాడు
O.S.No.243/2023
Between:-
దోనేపూడి గీత ...ప్లైంటిఫ్
మరియు
కొలిమి మేరి వీర రాజ్ కుమార్ అండ్ అదర్స్ ...రెస్పాండెంట్స్
ప్లైంటిఫ్ అయిన దోనేపూడి గీత W/o.రవి రెస్పోండెంట్స్ అయిన 1 కొలిమి మేరి వీర రాజకుమార్ S/o.సత్యనారాయణ 2. కొలిమి జ్యోతిW/o.మేరి వీర రాజ్‌కుమార్. లింగంపర్తి గ్రామం, ఏలేశ్వరం మండలం, కాకినాడల జిల్లా అను వారి పై **O.S.కేసు నెం.243/2023** గా గౌరవ నియులైన **జూనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్ ప్రత్తిపాడులో** కేసు దాఖలు చేసి ఉన్నారు. పై నెంబరు కేసులో కోర్టు వారి నుండి రెస్పాండెంట్ కి ఎన్నిసార్లు నోటీసులు, సమన్లు పంపిన తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. రెస్పాండెంట్ హాజరు నిమిత్తం గౌరవనీయ కోర్టు వారు కేసు వాయిదా **13-08-2025వ** తేదిన వేసినారు. **ది.13-08-2025వ** తేదిన రెస్పాండెంట్ స్వయంగా కాని, ప్లీడరు గారు ద్వారా కానీ కోర్టుకి హాజరై తమ ఆక్షేపణలు తెలియచేసు కొనవలసిందిగా ఆ విదంగా హాజరు కాకుండా ఆక్షేపణలు తెలియచేయంని యెడల రెస్పాండెంట్ పరోక్షమున కేసు తీర్మానించబడునని కోర్ట్ వారి ఆర్డర్ పై ఈ ప్రకటన ద్వారా తెలియ ంచేయడమైనది.
(కోర్ట్ వారి ఆర్డర్ పై)
N.V.V.S.S.N.L.DEVI
Advocate
Yeleswaram, Cell.9989359545